# జైహింద్

## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**"ఇంత కంటే** దగ్గరగా వెళ్తే రెండు జలాంతర్గాములు గుద్దుకునే అవకాశం ఉంది." అన్నాడు మ్యూసెన్‌బర్గ్.

కొద్దిసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు బోస్.

"మీరు కావాలంటే జర్మనీ తిరిగి వెళ్లిపోదాం..." అన్నాడు మ్యూసెన్‌బర్గ్.

అంతే బోసులోని యుద్ధ వీరుడు నిద్ర లేచాడు. "ఇంత దూరం వచ్చింది వెనక్కి వెళ్లటానికి కాదు..." అంటూ డింగీలోకి ఎక్కాడు. అతని వెనుక అతని సెక్రటరీ హసన్ కూడా ఎక్కాడు. వారు తప్ప ఏ నావికుడూ డింగీలో లేరు. వారే తెడ్లు వేసుకుంటూ జపాను జలాంతర్గామి వైపు బయలుదేరారు. మ్యూసెన్‌బర్గ్ కూడా వారి ధైర్యానికి నోరు తెరచుకుని చూస్తూ ఉండి పోయాడు. రెండు మూడు సార్లు రాకాసి అలలు ఆ డింగీని ముంచెత్తాయి. అదృష్టం అతని పక్షాన ఉండటంతో ఆ కిలోమీటరు దూరం ప్రయాణించి జపాను జలాంతర్గామి ఎక్కాడు బోసు.

ప్రయాణం మొదలు పెట్టిన మూడు నెలల తరువాత సుమత్రా దీవుల దగ్గర జలాంతర్గామి దిగాడు బోస్. అతని కోసం ఎదురుచూస్తున్నాడు జపాన్ కలనల్ యమమోటో. యమమోటోతో బోసుకు ముందే జర్మనీలో పరిచయం ఉంది. వారిద్దరికీ ఒకరంటే ఒకరికి గౌరవం కూడా ఉంది. బోసును అతను విమానంలో టోక్యోకి తీసుకు వెళ్లాడు.

1943, మే 16 న టోక్యో చేరాడు బోస్.

జపాను ప్రభుత్వం సాదరంగా బోసును ఆహ్వానించింది. బోసుకు అన్ని విధాలా సహకరిస్తామని వాగ్దానం చేసింది. బోసు స్థాపించబోయే ఆర్మీని భారత సైన్యంగా, బోసు ప్రభుత్వాన్ని ప్రవాసంలో ఉన్న భారత ప్రభుత్వంగా గుర్తించటానికి అంగీకరించింది.

జూన్ 12 న అధికారికంగా బోస్ ఉనికిని జపాన్ ప్రభుత్వం ప్రకటించింది. బోస్ ఒక పత్రికా సమావేశం పెట్టి తన ప్రణాళికలను వివరించాడు. ఇక్కడ మొదలయిన తన ప్రయాణం ఢిల్లీ చేరేవరకు ఆగదని ప్రకటించాడు.

జూన్ 27 న బోస్ సింగపూర్ చేరుకున్నాడు. 1943, ఆగస్ట్ 8 న ఇండియన్ నేషనల్ ఆర్మీ సుప్రీం కమాండర్‌గా మోహన్‌సింగ్ నుండి పదవీ బాధ్యతలు స్వీకరించాడు.

అసలు పోరాటం అప్పుడు మొదలయింది.

“నేతాజీ సుభాస్ చంద్ర బోస్ సింగపూర్ రావటానికి ముందు జరిగిన చరిత్ర అది…” చెప్పటం ముగించింది కాంచనమాల.

“ఆయన జీవితం ఒక థ్రిల్లర్ నవలకు ఎంతమాత్రం తీసిపోదు మేడమ్…” అన్నాడు మయాంక్.

“అన్నీ అనుకున్నట్లు జరిగి, ఆయన ఆధ్వర్యంలో భారతదేశానికి స్వాతంత్రం వచ్చి ఉంటే అప్పుడు ఈ దేశం పొజిషన్ వేరేగా ఉండేది… కానీ మనం అనుకున్నవి అన్నీ జరగవు.” విచారంగా అంది కాంచనమాల.

“ఒకవేళ ఆయన ఆధ్వర్యంలో స్వాతంత్రం వచ్చి ఉంటే దేశం ఎలా ఉండేదని మీరు భావిస్తున్నారు?”

“ఆయనకు కుల వ్యవస్థ మీద సదభిప్రాయం లేదు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే కుల వ్యవస్థ ఉండకూడదని భావించాడు. అందుకు అవసరమయితే కొంతకాలం దేశాన్ని నియంత్రుత్వంలో ఉంచినా తప్పులేదని అనుకున్నాడు. దేశ ప్రజలలో ఒక క్రమశిక్షణ వచ్చేవరకు కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని అనేవాడు. పారిశ్రామికంగా దేశాన్ని అభివృద్ధి చేయాలని కలలు కనేవాడు…” చెప్పింది కాంచనమాల.

“రేపు మయన్మార్ వెళ్లే ఏర్పాట్లు చేస్తున్నాను మేడం…” అన్నాడు మయాంక్. “మీ రోజుల్లో దానిని బర్మా అనే వారనుకుంటా, దానిని ఇపుడు మయన్మార్ అంటున్నారు. మీరు ఆజాద్ హింద్ ఫౌజు సైన్యంతో పాటు సింగపూర్ నుండి అక్కడకేగా వెళ్లారు. రంగూన్‌లో మన బస ఏర్పాట్లు చేసేశాను…” అంటూ చెప్పుకుపోతున్నాడు మయాంక్.

“బర్మా అన్నా, మయన్మార్ అన్నా నాకు పెద్ద తేడా లేదు. నా దృష్టిలో అది చేవా పుట్టిన దేశం… అంతే!!!”

“చేవానా?… అంటే ఎవరు?”

“నాకూ, మధుబాలకీ చేరువయిన నేస్తం. చేవా అంటే పౌరుషం. చేవా అంటే తిరుగుబాటు. పురుష అహంకారానికి గొడ్డలి పెట్టు చేవా. ఉత్త చేతులతో పెద్ద పులిని చంపిన ధీరురాలు. ”

“మేడం… మీరు ఇలా ఒకొక పేరు చెప్తూ ఉత్సుకత పెంచటం భావ్యం కాదు. ఈ పేరు నాకు ముందు ఎందుకు చెప్పలేదు. మీ మాటలను బట్టి చేవా అంటే ఒక స్త్రీ అని అర్థమయింది. ఆమె పెద్దపులిని చంపటమేమిటి? అదెలా సాధ్యమయింది?” అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు మయాంక్.

"నేను నీకు చెప్పింది చాలా తక్కువ మయాంక్. చెప్పవలసింది బోలెడు ఉంది. ఆజాద్ హింద్ ఫౌజులో రాణీ ఆఫ్ ఝాన్సీ రెజిమెంట్ ఒకటి ఉండేది. అందులో కేవలం ఆడవాళ్లు ఉండేవాళ్ళు. చేవా కూడా అందులో ఒక సభ్యురాలు. నాకూ, మధుబాలకీ దగ్గరయిన నేస్తం. అయినా ఒక్క రోజులో ఎన్నని తెలుసుకుంటావ్? ఈ రోజుకు ఇది చాలు..." అంటూ లేచింది కాంచనమాల.

ఇద్దరు తమ బస చేసిన హోటల్ దగ్గరకు వచ్చేశారు.

రాత్రి భోజనాల తరువాత టి.వి. ఆన్ చేసింది కాంచనమాల. నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ వస్తోంది. అందులో రాయల్ బెంగాల్ టైగర్ గురించి చూపిస్తున్నారు. ఆ పులిని చూడగానే తిరిగి మరోసారి చేవా గుర్తుకు వచ్చింది కాంచనమాలకు.

1940 దశకం...

బర్మా దేశాన్ని మూడొంతులు పైగా దట్టమయిన అడవి ఆక్రమించుకుని ఉంటుంది. సైమూన్, బైకుంగ్ పట్టణాలకు దగ్గర్లో ఉన్న అడవిలో ఒక గిరిజన తాండాలో పుట్టింది చేవా.

చేవా ఉండే తాండా మనుషులు అడవిలోని చెట్లు కొట్టి భూమిని చదును చేసి సాగు చేసుకుంటారు. కొంత కాలానికి ఆ భూమిలో సారం తగ్గిందని అనిపించినపుడు మొత్తం ఊరు మరో ప్రాంతానికి తరలి వెళ్లి అక్కడి భూమిని చదును చేసుకుని బ్రతుకుతారు.

తరతరాలుగా ఈ రకమయిన జీవన విధానానికి అలవాటు పడ్డారు వారు. దేశం బ్రిటిషు వారి ఆక్రమణలోకి వెళ్లింది. బ్రిటిషు ప్రభుత్వం అన్నిటి మీద ఆంక్షలు పెట్టింది. చెట్లు కొట్టి భూమిని చదును చేయకూడదంది. ఆడవిలో జంతువులను వేటాడకూడదంది. అవేమీ చేయకుండా తామెలా బ్రతకాలో మాత్రం ఆ తాండా వాసులకు ఎవరూ చెప్పలేదు.

ఇంతలో జపాను వాళ్ళు వచ్చారు. బ్రిటిషు వాళ్లని తరిమి కొట్టి బర్మా మీద ఆధిపత్యం తమదే అన్నారు.

కొంత మంది బర్మా యువకులు అప్పటికే గెరిల్లా దళాలుగా ఏర్పడి స్వాతంత్రం కోసం పోరాడుతున్నారు. కానీ వాళ్లు ఎవరితో తలపడాలో వారికే స్పష్టత లేదు. పాత బ్రిటిషు వాడు పక్కనే ఇండియాలో కాచుకు కూర్చున్నాడు. ఎప్పుడయినా తిరిగి మీద పడవచ్చు. కొత్త జపాను వాడు ఎన్ని రోజులు ఉంటాడో తెలియదు. తాండా నాయకుడు డాచెన్. ఎవరి మీద తిరగబడినా పర్యవసానాలు ఎలా ఉంటాయో బాగా తెలిసిన వాడు. అందుకే అతనికి వారి మీద సానుభూతి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి సహాయం చేయలేదు.

డాచెన్ కూతురు చేవా. పేరుకు ఆడపిల్లే కానీ వీరత్వంలో ధైర్యంలో ఏ మగ పిల్లాడికీ తీసిపోదు. అతనికి మొగ పిల్లలు లేరు. తాండాలో యుక్తవయసులయిన మొగ పిల్లలు తదుపరి తాండా నాయకత్వం కోసం పోటీ పడుతున్నారు.

తను బ్రతికి ఉండగానే తదుపరి నాయకుడిని ప్రకటించక పోతే వారు ఒకరితో ఒకరు తగవులు పడతారని భావించిన అతను తాండా ఆచారం ప్రకారం వైశాఖ పౌర్ణమి రోజున బోడు వేట ఉంటుందని ప్రకటించాడు.

నాయకుడికి మగపిల్లలు లేకపోతే బోడు వేట పద్ధతిలో తదుపరి నాయకుడిని ఎన్నుకోవటం వారి పద్ధతి. తాండా నాయకత్వం ఆశిస్తున్న పెళ్ళి కాని యువకులందరు అడవిలోకి ఒంటరిగా వెళ్ళి, ఒక రోజు లోపు వేటాడిన జంతువును తీసుకుని తిరిగి గూడానికి రావాలి. ఏ జంతువు ఎక్కువ విలువయినదయితే అతనికి నాయకత్వం దక్కుతుంది. కుందేలు కంటే జింక ఎక్కువ విలువ గలది. అలానే జింక కంటే తోడేలు, తోడేలు కంటే ఎలుగుబంటి విలువయినవి. అన్నిటి కంటే గొప్పది పెద్దపులి. ఆ పెద్దపులిని ఒంటరిగా, ఒక్కడే వేటాడటం అన్నది ఆ తాండా చరిత్రలో ఇంతవరకు జరగలేదు. పెద్దపులి కాకపోయినా, పెద్ద జంతువును వేటాడి తెచ్చిన వీరుడికి దక్కేది నాయకత్వం ఒక్కటే కాదు... ప్రస్తుత నాయకుడికి కూతుర్లు ఉన్నట్లయితే అందులో పెద్ద కూతురు కూడా ఇతనిది అవుతుంది. ఆమెను పెళ్లి చేసుకుని తాండా నాయకత్వం స్వీకరిస్తాడు కొత్త నాయకుడు.

బోడు వేటకు సిద్ధమయిన యువకులు ఎవరికి వారు వేటలో అమలు చేయవలసిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు.

ఈలోగా ఒకరోజు ఆకాశంలో తక్కువ ఎత్తులో ఎగురుతున్న విమానం కనిపించింది. కింద జనావాసాలు కనిపించిన ప్రతిసారీ కరపత్రాలు వెదజల్లుతున్నారు. కొన్ని కరపత్రాలు వీరి దగ్గర కూడా పడ్డాయి. చదవటం, రాయటం వచ్చిన అతి కొద్ది మందిలో చేవా కూడా ఒకరు. ఒక కరపత్రం తీసుకుని దానిలో ఏముందో చదివింది ఆమె.

బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జపాను ప్రభుత్వం చేస్తున్న యుద్ధంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ కూడా భాగస్వామ్యం అయిందని చెప్తూ, బర్మా యువతని కూడా ఆ ఆర్మీలో చేరమని విజ్ఞప్తి ఉంది ఆ కరపత్రంలో.

చేవాకు ఎప్పటి నుండో తమ దేశాన్ని ఆక్రమించుకున్న బ్రిటిషు వారన్నా, ఇప్పుడు కొత్తగా వస్తున్న జపాను వారన్నా కోపం. వారి చెర నుండి ఎంత త్వరగా తమ దేశం విముక్తి పొందుతుందా అని ఎదురు చూసే వ్యక్తుల్లో ఆమె ఒకరు. బ్రిటిషు వారికి వ్యతిరేకంగా బర్మా యువకులు కూడా పోరాటం చేస్తున్నా, వాళ్లకు శిక్షణ లేదు. ఆయుధాలు లేవు. ఒక పద్ధతిలో యుద్ధం చేసే వ్యూహం లేదు. ఆవేశం కొద్దీ ఏదో చేయబోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈసారి వారు కనపడితే వారిని కూడా ఈ భారత సైన్యంలో చేరమని చెప్పాలని అనుకుంది చేవా. ఆ కరపత్రాన్ని తీసి జాగ్రత్త చేసింది.

శ్రావణ పౌర్ణమి రానే వచ్చింది. ఆ రోజు ఉదయాన్నే ఆడవి దేవతకు పూజలు చేశాడు పూజారి చంపో.

తరువాత డాచెన్ నిలబడి, సమావేశమయిన అందరికి వినిపించేటట్లు, "బోడువేటలో ఎవరెవరు పాల్గొనబోతున్నారో వారందరూ ముందుకు రండి. వచ్చి పూజారి ఆశీర్వాదం తీసుకోండి..." అన్నాడు.

యువకులు చాలా మంది ముందుకు వచ్చారు.

వారి ఆయుధాలు దేవత ముందు పెట్టి పూజారి చేత మంత్రాలు చదివించుకున్నారు.

"ఈ ఆయుధాలకు కూడా పూజ చేయండి…" అంటూ ముందుకు వచ్చిన చేవాని చూసి అందరూ నోర్లు తెరిచారు. చేతిలో విల్లు పట్టుకుని, నడుములో ఛురిక దోపుకుని నిలబడి ఉంది చేవా. ఆడపిల్లలు వేటకు వెళ్లటమే అరుదు. అలాంటిది మగవాళ్లతో పోటీ పడతానంటున్న చేవాని చూసి వారు విస్తు పోయారు.

అప్పటికీ ఒక వృద్ధుడు, "ఆడపిల్లకు వేట ఏమిటి?" అని అననే అన్నాడు.

"ఆడపిల్ల వేటాడ కూడదని ఎవరు చెప్పారు? దేవత చెప్పిందా? అట్లా అయితే దేవత చేతుల్లో ఆయుధాలు ఎందుకు ఉన్నాయి?" అని ధాటీగా ప్రశ్నించింది చేవా.

ఎవరూ సమాధానం చెప్పలేక పోయారు.

"ఒకవేళ నా చేతుల్లో ఓడి పోతానని భయమా?" పోటీ పడుతున్న ఇతర యువకులను చూసి ఎగతాళిగా అంది చేవా.

ఈసారి ఆమెను అడ్డుకోవటానికి వారికి అహంభానం అడ్డు వచ్చింది.

పోటీ మొదలయింది.

పోటీ పడుతున్న వాళ్లంతా అడవిలో తలా ఒక దిక్కుకు వెళ్లారు.

చేవా ఆడపిల్ల అయినా ఏనాడూ అలా పెరగలేదు. ఆమె స్వభావంలోనే ఎదిరించే గుణం ఉంది. ఎవరయినా ఒక పని వద్దు అంటే, దానినే చేసేది. ఆమెకు మగపిల్లలతో సమానంగా అన్ని విద్యలు నేర్పించాడు డాచెన్. నిజం చెప్పాలంటే తండాలో చాలా మంది యువకుల కంటే చేవా శక్తివంతమయినదే కాదు, తెలివయినది కూడా.

అడవిలోకి వెళ్లబోయే ముందు తండ్రి దగ్గరకు వచ్చి నిలబడింది చేవా.

సన్నగా, బారుగా, నిలువెత్తు ఆత్మవిశ్వాసంలా కనిపించింది చేవా అతని తండ్రికి. తన కూతురు సామర్ధ్యం గురించి డాచెన్‌కు బాగా తెలుసు. బర్మాకు వాయువ్యంలో ఉన్న ఈ అడవిలో ఏ మూల ఏముందో ఆమెకు క్షుణ్ణంగా తెలుసు. అందుకే ఆమెను అడవిలోకి పంపటానికి అతనికి ఎలాంటి భయమూ లేదు. అంతే కాదు మనస్పూర్తిగా ప్రయత్నిస్తే, మిగిలిన యువకుల కంటే తన కూతురే ఈ పోటీలో విజేతగా నిలుస్తుందని కూడా అతనికి తెలుసు. అతను భయపడుతుంది దాని గురించే… ఒకవేళ ఈ పోటీలో చేవా విజేత అయితే, తాండా నాయకత్వం కూడా తనే కోరుకుంటుంది. అప్పుడు పోటీలో ఉన్న మిగిలిన మగవాళ్లందరూ ఆమెకు వ్యతిరేకమవుతారు. అంతమంది వ్యతిరేకతతో ఆమె తాండా నాయకత్వం తీసుకున్నా ఏమి సాధిస్తుంది? హాయిగా పోటీలో గెలిచిన వాడిని మనువాడితే జీవితం ప్రశాంతంగా ఉంటుంది కదా అన్నది అతని అభిప్రాయం. అయితే తనదంటూ ఒక నిర్ణయం తీసుకున్న తరువాత చేవా ఎవరి మాటా వినదని అతనికి తెలుసు. అందుకే ఆమెను ఆశీర్వదించటం కంటే మరో మార్గం లేకపోయింది అతనికి.

తండ్రి అనుమతి తీసుకుని అడవిలోకి ప్రవేశించింది చేవా.

ఆమెకు అడవిలో ఏ జంతువు ఎక్కడ ఉంటుందో, ఏ కాలంలో అవి ఎటు వెళ్తాయో బాగా తెలుసు. అడవిలో ఒక వాగు ఉంది. అది ఎగువన ఎక్కడి నుండో వస్తుందో కానీ, ఇక్కడ అడవిలో కొండ మీద నుండి తిన్నగా కిందకు జలపాతంలా పడుతుంది. అలా ఏర్పడిన జలపాతం కింద నేల మీద పడే చోట ఒక పెద్ద మడుగు ఏర్పడింది. దానిలో నుండి నీరు ప్రవాహంలా పారి కింద లోతట్టు ప్రాంతాలకు వెళ్ళి పోతుంది. జలపాతం నుండి వచ్చే నీరు వానాకాలం ఎక్కువగా, మిగిలిన కాలాల్లో తక్కువగా ఉంటాయి. కానీ మడుగులో మాత్రం సంవత్సరం మొత్తం నీళ్ళు నిలువ ఉంటాయి. ఆ నీటి కోసం రకరకాల అడవి జంతువులు అక్కడకు వస్తుంటాయి. ఆ సంగతి చేవా కు మాత్రమే కాదు అందరికీ తెలుసు. అందుకే నీటి కోసం వచ్చిన జంతువులను మాటు వేసి చంపవచ్చని అందరు పోలోమని ఆ మడుగు దగ్గరకు బయలుదేరారు.

అందరి కంటే ఆఖరున బయలుదేరిన చేవా అడ్డదారిన ప్రయాణించి మడుగు దగ్గరకు అందరికంటే ముందు చేరింది.

ఆగకుండా సంవత్సరాలుగా పడుతున్న జలపాతపు నీటి ఉరవడికి కొండ రాతి శిలలు నున్నగా మారి నిగనిగలాడుతున్నాయి. ఆ కొండల్లోనే కొంత ఎత్తున అనేక చిన్న చిన్న గుహలు కూడా ఉన్నాయి. వాటికి చేరుకునే మార్గం చాలా సన్నగా ఒక అడుగు వెడల్పు మాత్రమే ఉంటుంది. ఆ దారికి ఒక పక్కన కొండ శిలలు, రెండవ వైపు జలపాతం పడుతున్న లోయ ఉండటంతో దాని మీద నడవటం చాలా కష్టం. కానీ పులి ఆ దారిలో చాలా తేలిగ్గా నడుచుకుంటూ పైకి వెళ్లగలదు. ఆ గుహల్లో పులులు ఉంటాయని అందరూ అనుకుంటూ ఉంటారు. రాతి నేల కాబట్టి అక్కడ పులి అడుగు జాడలు కూడా కనపడవు. చిన్నా, చితకా జంతువులను కాకుండా సరాసరి ఆ గుహల్లో ఉన్న ఒక పులిని వేటాడాలని ఆమె ఉద్దేశం.

ముందుగా మడుగు పరిసరాల్లో ఎక్కడెక్కడ పులి అడుగు జాడలు ఉన్నాయో గమనించింది. అవి ఎక్కడ నుండి వస్తున్నాయో, ఎటు వెళ్తున్నాయో జాగ్రత్తగా పరిశీలించింది. ఆమె అనుకున్నట్లే ఇంకా తడిగా ఉన్న పులి అడుగులు గుహ వైపు వెళ్తూ కనిపించాయి. మడుగు వేపు వస్తున్న అడుగుల కంటే ఇవి బురదలో మరింత లోతుగా ఉన్నాయి. అంటే అది తనతో పాటు ఏదో జంతువును వేటాడి తీసుకు వెళ్లిందన్నమాట. మరింత ముందుకు వెళ్లి చూస్తే అడుగుజాడల పక్కన అస్పష్టంగా రక్తపు మరకలు కనిపించి ఆమె ఊహ నిజమే అని చెప్పాయి. పులి ఏదో జంతువును వేటాడి గుహలోకి తీసుకు వెళ్లి ఉంటుందని ఊహించింది ఆమె. కాకపోతే ఇప్పుడు తెలియాల్సింది... పులి ఏ గుహలో ఉంది? అసలు గుహలో ఉందా, లేదా? అన్నదే.

ఒక వైపు మడుగు, మరో వైపు గుహలు కనిపించేలా... ఆ పరిసరాలకు దూరంగా ఉన్న ఒక చెట్టు ఎక్కి కూర్చుంది చేవా. చెట్టు ఏపుగా, బలంగా పెరిగి ఉంది. దాని కొమ్మల మధ్య విశ్రాంతిగా కూర్చునే వెసులుబాటు ఏర్పాటు చేసుకుని

పరిసరాలను గమనించటం మొదలు పెట్టింది. ముఖ్యంగా ఆమె చూపు గుహల మీదే ఉంది. అక్కడ ఉన్న నాలుగయిదు గుహలలో ఏ గుహ నుండి అయినా పులి బయటకు వస్తుందా అని చూస్తోంది.

మరి కాసేపటి తరువాత ఒకరొకరుగా తాండాకు చెందిన యువకులు మడుగు దగ్గరకు వచ్చారు. అంత మంది అక్కడే ఉంటే తామే మరొకరికి అడ్డు అవుతామని వారికి తెలుసు. అందుకే ఒకరిద్దరు వేరే చోటు వెతుక్కుంటూ వెళ్లి పోయారు. మిగిలిన వారిలో కొందరు బురద నేల మీద కాలి గుర్తులు చూసి జంతువులు వచ్చే ప్రదేశం గుర్తించి ఉచ్చులు పన్ని కూర్చున్నారు.

వేటగాడికి ఉండవలసింది ఓర్పు. గంటలు గడిచినా తను అనుకున్న జంతువు వచ్చేంత వరకు మాటు వేసి ఉండగలగాలి. ఆ ఓర్పు లేని వాడు గొప్ప వేటగాడు కాడు.

రెండు మూడు గంటలు గడిచి మిట్ట మధ్యాహ్నం అయింది. వాళ్లు పన్నిన ఉచ్చుల్లో కుందేళ్ల లాంటి చిన్న జంతువులు తప్ప పెద్ద జంతువు ఒకటి కూడా పడ లేదు. ఇంతలో ఒక మొసలి మడుగులో నుండి ఒడ్డుకు వచ్చి నోరు తెరచి ఎండకు ఎదురుగా పడుకుని విశ్రాంతి తీసుకోసాగింది.

యువకుల్లో ఒకడు దానిని వేటాడటానికి నిశ్చయించుకున్నాడు. తాడుతో ఉచ్చు తయారు చేసి అడుగులో అడుగు వేసుకుంటూ దాని దగ్గరకు నడిచాడు. అందుబాటు దూరంలోకి వచ్చాక తెరచుకున్న దాని నోరు చుట్టూ పడేలా చేతిలోని తాడును విసిరాడు. మొసలి ఉలిక్కిపడి తాడును విదిలించుకోబోయింది. అయితే మొసలి విదిలించుకోవటానికి ప్రయత్నించే కొద్దీ తాడు మరింత బిగుసుకుంది.

ఈలోపు ఆ యువకుడు పరుగెత్తుతూ వెళ్ళి తాడు ఇంకొక కొసను చెట్టు మొదలుకు కట్టాడు. ఇప్పుడు మొసలి తాడుతో చెట్టుకు బంధింపబడింది. తన బంధనాలను విడిపించుకోవటానికి అది పెనుగులాడుతోంది. కానీ నీటి బయట దాని బలం అంతంత మాత్రమే. ఈలోపు యువకుడు తన దగ్గర ఉన్న కత్తిని తీసుకుని దాని వెనుక పక్కకు చేరాడు. మొసలి వెనుకకు తిరగలేక పోయినా శత్రువు వెనుక ఉన్నాడని గమనించుకోగలిగింది. తన తోకతో వెనుక చేరిన శత్రువు మీద దాడి చేస్తోంది. అయితే ఆ యువకుడు పెద్ద కత్తిని బయటకు తీసి తోకకు అందకుండా జాగ్రత్త పడుతూ మృదువుగా ఉండే మొసలి పొట్ట భాగంలో పొడిచాడు. మరింత బలంగా తిరగబడసాగింది ఆ మొసలి. అయితే ఆ యువకుడు చేస్తున్న ఒక్కొక్క దాడితో దాని బలం తగ్గిపోయి బలహీన పడసాగింది. ఎట్టకేలకు దానిలో కదలికలు ఆగిపోయాయి.

కొద్దిసేపు వేచి చూసిన ఆ యువకుడు ఆ మొసలికి కట్టిన ఉచ్చు విప్పతీసి దానిని భుజాన వేసుకుని అతి కష్టం మీద మోస్తూ తాండా వైపు బయలుదేరాడు.

మిగిలిన వారందరూ అతన్ని ఈర్ష్యతో చూస్తూ ఉండి పోయారు.

ఇప్పుడు మొసలి కంటే పెద్ద జంతువును వేటాడితే తప్ప ఆ యువకుడిని జయించే అవకాశం లేదు. అందుకే కొంత మంది నిరాశతో తమ ప్రయత్నాలను విరమించుకున్నారు.

నీరు త్రాగటానికి వచ్చిన ఎలుగును పట్టుకోవాలన్న మరో యువకుడి ప్రయత్నం వికటించింది. అతని ఉచ్చులో చిక్కుకున్నట్లే చిక్కుకుని తప్పించుకున్న ఎలుగు ఆ యువకుడిని తీవ్రంగా గాయపరిచింది. అతని కేకలు విన్న ఇద్దరు తమ పని ఆపి అతన్ని మోసుకుంటూ వెళ్లారు. కొంత మంది యువకులు ఎంత ప్రయత్నించినా తేలికపాటి జంతువులు తప్ప మరేమీ దొరకక వాటితోనే సరిపెట్టుకున్నారు. వేరే దిక్కులకు వెళ్ళిన వారి పరిస్థితి ఏమిటో చేవాకు ఇంకా తెలియదు. కానీ వారి పరాక్రమం గురించి బాగా తెలుసు కాబట్టి, వారికి పెద్ద జంతువులు దొరికే అవకాశం లేదని మాత్రం ఖచ్చితంగా ఊహించింది.

రాత్రి పూట నీరు తాగటానికి ఆ మడుగు దగ్గరకు పెద్ద క్రూర మృగాలు వస్తాయని అందరు అనుకుంటుంటారు. ఆ సమయంలో ఆ పరిసరాల్లో ఉండటం క్షేమం కాదు కాబట్టి వెలుతురు ఉండగానే అందరు వెను తిరిగారు.

చెట్ల గుబురుల మధ్య కూర్చుని ఉన్న చేవా కింద జరుగుతున్న ప్రతి విషయాన్నీ గమనిస్తోంది. సాయంత్రం అయ్యేటప్పటికి వచ్చిన యువకులందరు వెళ్ళిపోయారు.

చేవా నెమ్మదిగా చెట్టు దిగి వచ్చింది.

ఉదయం నుండి మాటు వేసి ఉన్నా పైన ఉన్న గుహల్లో ఎలాంటి అలికిడీ లేదు. మరింత సమయం అయితే వెలుతురు పూర్తిగా తగ్గిపోతుంది. రాత్రి సమయం మనిషికి అవరోధాలు కలిగిస్తే పులికి అనుకూలంగా మరుతుంది.

ఉదయం నుండి వేచి చూసినా గుహలో పులి ఉందో లేదో తెలియలేదు. తను పైకి వెళ్లి పరిశీలించటం తప్ప మరో మార్గం కనపడటం లేదు.

అడుగులో అడుగు వేస్తూ కొండ వాలున ఉన్న సన్నటి రాతి మార్గం మీద పైకి నడవటం మొదలు పెట్టింది చేవా. ఇలాంటపుడు పులి ఎదురయితే ఎంత ప్రమాదమో ఆమెకు బాగా తెలుసు. అయినా కడుపు నిండిన పులి ఇప్పుడప్పుడే గుహ నుండి బయటకు రాదని ఆమె ఊహించింది.

దారిలో అక్కడక్కడా కనిపిస్తున్న రక్తపు మరకలు ఆమె ఊహకు బలం చేకూరుస్తున్నాయి. ఎట్టకేలకు గుహ దగ్గరకు చేరుకుంది చేవా. అక్కడ వరుసగా ఉన్న గుహలలో ఒక గుహలోకి రక్తపు మరకల జాడలు దారి తీశాయి. ఇప్పుడు ఆమెకు పులి ఏ గుహలో ఉంటుందో కూడా తెలిసింది. కానీ, గుహలోకి అడుగు పెట్టి పులి ఉందో నిర్ధారణ చేసుకోవటం మూర్ఖత్వం అని ఆమెకు తెలుసు. నిజంగా పులి గుహలో ఉంటే తను తిరిగి బయటకు రావటం అంటూ జరగదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS